క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ రాఘవేంద్రనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాఘవేంద్రనగర్, సీతారాంనగర్, ఇందిరానగర్, వడ్డెరకాలనీ, కాళ్లకుంటకాలనీ, లలితాపరమేశ్వరి నగర్, గాడిచర్లపల్లి, ఎఫ్‌సీఐ గోదాం, ప్రాంతాలలో ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

హుస్నాబాద్: గుడ్ ఫ్రైడే పర్వదినం సందర్భంగా పట్టణంలోని బేతేలు చర్చిలో క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాస్టర్ కె.ఇశ్రాయెల్ సందేశాన్ని భక్తులకు వినిపించారు. ప్రేమ, సామరస్యంతో జీవించాలన్న క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరు ఆచరించాలని చెప్పారు. ప్రత్యేక ఆరాధనల అనంతరం భక్తులకు పండ్లరసాలను పంపిణీ చేశారు.

షాలేము ప్రార్థన మందిరంలో

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని షాలేము ప్రార్థన మందిరంలో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్రదర్ అందె విజయ్‌కుమార్ దైవ సందేశం వినిపించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ శామ్యూల్, కుమార్, ప్రభాకర్, జోసెఫ్, జాన్ వెస్లీ, హనోక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితుడు

నంగునూరు(సిద్దిపేట): అక్కెనపల్లిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 29వ వార్షిక వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు బ్రహ్మచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. ఈ సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాస్కర్, వెంకటయ్య, కొమురయ్య, పెద్ద రాజిరెడ్డి, రజినీకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీని ఆదరించండి



ప్రయాణికులకు గులాబీ ఇస్తున్న డీఎం

హుస్నాబాద్/సిద్దిపేటకమాన్: ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని డిపో మేనేజర్లు వెంకన్న, రఘు కోరారు. స్థానిక బస్టాండ్‌లలో శుక్రవారం కర్టసీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రయాణికులకు గులాబీలు, కీచైన్‌లు పంపిణీ చేశారు. వెంకన్న మాట్లాడుతూ డ్రైవర్, కండక్టర్లు ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. కార్యక్రమంలో డిపో ట్రాఫిక్ సూపరిండెంట్, ఏడీసీలు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్దిపేటలో డీఎం రఘు మాట్లాడుతూ కీచైన్‌లో క్యూఆర్ కోడ్ ఉందని దానిని స్కాన్‌చేస్తే ఆర్టీసీకి సంబంధించిన యాప్, ఆన్‌లైన్ రిజర్వేషన్, సోషల్ మీడియా అకౌంట్‌లు ఉంటాయన్నారు. ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

కనీస సౌకర్యాలు కల్పించండి



కూలీలతో మాట్లాడుతున్న హరికృష్ణారెడ్డి

తొగుట(దుబ్బాక): ఉపాధి హామీ కూలీలు పని చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గోవర్ధనగిరి, వర్దరాజుపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకొన్నారు. కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు కొనసాగినన్ని రోజులూ తాగునీరు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామిరెడ్డి, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, ఎల్లం, రాఘవులు, జనార్దన్, కనకయ్య పాల్గొన్నారు.





రిసార్ట్.. ఎప్పుడు స్టార్ట్?

- ప్రారంభానికి నోచుకోని సుడా రిసార్ట్
- శిథిలమవుతున్న సామగ్రి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద నిర్మించిన కాటేజీలు ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. సుడా ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లు వెచ్చించి నాలుగు ఎకరాల స్థలంలో మూడు కాటేజీలు నిర్మించారు. వాటితో పాటు రెస్టారెంట్, బాంకెట్ హాల్ నిర్మాణంతో పాటు చిన్నారులకు ఆట వస్తువులు సమకూర్చారు. అన్ని హంగులతో రిసార్ట్ నిర్మించడంపై పర్యాటకులు సంతోషించారు. కాని అధికారుల సమన్వయలోపం వల్ల రెండున్నరేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో కాటేజీలు, ఆట వస్తువులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పర్యాటకుల ఆనందం నీరు గారిపోతోంది.





యాసంగి సాగు.. మేతగా పశువులకు

- అందని భూగర్భ జలాలు, ఆపై విద్యుత్ కష్టాలు
- ఎండిపోయిన వరి పంట.. రూ.50 వేలు నష్టం

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు ఎన్నో ఆశలతో యాసంగిలో వరిసాగు చేపడితే చివరికి అది పశువులకు మేతగా మారింది. జగదేవ్‌పూర్ మండలంలోని నిర్మల్‌నగర్ గ్రామానికి చెందిన రైతు యాదగిరి రెండెకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోరుబావుల్లో నీరు తగ్గింది. దీనికి విద్యుత్ కష్టాలు కూడా తోడయ్యాయి. 30 గుంటల భూమిలో సాగుచేసిన వరి పంట చేతికి అందే సమయంలో పూర్తిగా ఎండిపోయింది. దీంతో పశువులకు మేతగా వేస్తున్నాడు ఆ రైతు. సుమారు యాభై వేలకు పైగా నష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆదాని, అంబానీల కోసమే వక్ఫ్ బిల్లు

- సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలి
- ముస్లింల ర్యాలీలు, నిరసనలు

గజ్వేల్‌రూరల్: ఆదాని, అంబానీలకు లాభం చేకూర్చేందుకే ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చారని తంజీముల్ మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతిన్ ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని కోరుతూ ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ ర్యాలీ నిర్వహించారు. పాత కూరగాయల మార్కెట్ నుంచి ఇందిరాపార్కు చౌరస్తా మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దుచేసేవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన ర్యాలీకి డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, తంజుముల్ మజీద్ కమిటీ సెక్రటరీ మహ్మద్రియాస్, నాయకులు సయ్యద్ వలీయొద్దీన్, సాజిద్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్రం

దుబ్బాకటౌన్: వక్ఫ్ చట్టం రద్దయ్యే వరకు ముస్లింల పోరాటం ఆగదని దుబ్బాక మజీద్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్ అన్నారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం దుబ్బాకలో ముస్లిం నాయకుల ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. వారికి సీపీఎం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లు ముస్లింల అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్య దర్శి భాస్కర్, లచ్చపేట మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ అల్తాఫ్ హుస్సేన్, నాయకులు ఎండీ చాంద్ మియా, సలీం, నవాబ్, మొహమ్మద్ అలీమొద్దీన్, మహమ్మద్ మౌలానా జియాల్ తదితరులున్నారు.



గజ్వేల్‌లో ముస్లింలకు సంఘీభావం తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్: స్థానిక జామా మసీద్‌లో నిర్వహించిన నమాజ్‌లో ముస్లింలు నల్ల బ్యాడ్జిలు ధరించి కేంద్ర ప్రభుత్వంపై నిరసన తెలిపారు. తమ హక్కులను, తమను కాపాడాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ దేవుడికి దానమిచ్చిన ఆస్తులపై అజమాయిషీ లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం చూడడం సరికాదన్నారు. ముస్లింలు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జామా మసీద్ కమిటీ అధ్యక్షుడు బాషుమియా, ప్రధాన కార్యదర్శి హుస్సేన్, నాయకులు అయూబ్, షబ్బీర్, ఫసియొద్దీన్, ముంతాజ్ తదితరులు ఉన్నారు.



దుబ్బాకలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

అల్వాలలో..

మిరుదొడ్డి(దుబ్బాక): వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అల్వాలలో ముస్లింలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల మసీద్ కమిటీ అధ్యక్షుడు జహంగీర్ మాట్లాడుతూ ముస్లింల అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ సవరణ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ చట్టం రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో షాబొద్దీన్, హైమద్, హర్షద్, నసీరొద్దీన్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

వీడీసీ దిష్టిబొమ్మ దహనం

కల్లుగీత కార్మికుల నిరసన

కొమురవెల్లి(సిద్దిపేట): నిజామాబాద్ జిల్లా వెలికట్ట మండలం తాళ్ల రాంపూర్‌లో గౌడ కులానికి చెందిన మహిళలను అగౌరవపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రాజుగౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వీడీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా ఆలయానికి వచ్చిన గౌడ కుల మహిళలను విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, విష్ణుమూర్తి, నర్సింహులు, శ్రీకాంత్ గౌడ్, కనుకయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వీడీసీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

వేసవిలో తాగునీటి సమస్య రానివ్వం

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూస్తామని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌లో కొంతకాలంగా తాగునీటి సమస్య తలెత్తడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం బోరుబావిని తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య గురించి మూడు రోజుల క్రితమే తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సమస్య పరిష్కారానికి బోర్లు వేయిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్య ఉత్పన్నమైనా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.



బోరుబావి పనులు ప్రారంభిస్తున్న నర్సారెడ్డి

కొనుగోళ్లు లేక రైతుల ఇబ్బందులు

సీపీఎం నేత రవీందర్

కొమురవెల్లి(సిద్దిపేట): ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్‌ల ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అయినాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాలలో పోసి పదిరోజులు గడిచినా ఇంకా ప్రారంభించలేదన్నారు. కేంద్రాలు ప్రారంభించామని చెబుతున్న అధికారులు ఇప్పటి వరకు క్వింటాలు ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని ఆరోపించారు. కేంద్రాలలో ప్యాడీ క్లీనర్లు, సరిపడా టార్పాలిన్ కవర్లు లేవని వాపోయారు. మండలంలోని అన్ని గ్రామాలలోను ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించి, సకాలంలో రైతుల ఖాతాలలో డబ్బులు జమచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇస్తారి, ఎల్లయ్య, యాదగిరి, నర్సమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కేశవాపూర్‌లో తాగునీటికి ఇక్కట్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): కేశవాపూర్‌లోని ఎస్సీ కాలనీవాసులు గుక్కెడు మంచినీళ్ల కోసం అరిగోస పడుతున్నారు. కొంత మందికి చెందిన నల్లాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో మిగతా వాళ్లకు తాగునీరు దొరకడం లేదని, ఈ విషయం గురించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో నిత్యం తాగునీరు కోసం భగీరథ యత్నం చేయకతప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు పక్క కాలనీలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని, ఇకనైనా అధికారులు స్పందించి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

వారిని జాగృతంచేసే బాధ్యత మనదే..



సంఘీభావం తెలుపుతున్న యాదవులు

యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర నేత వెంకట్

ప్రశాంత్‌న గర్(సిద్దిపేట): విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాలలో జనాభా నిష్పత్తి ప్రకారం వాటా దక్కేంత వరకు యాదవులను జాగృతంచేసే బాధ్యత విద్యావంతులదేనని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకృష్ణ యాదవ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా యాదవ విద్యావంతుల రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదవులకు జనాభా ప్రకారం వాటా ఇవ్వడంలో అన్ని పార్టీలు విఫలమయ్యాయన్నారు. హైదరాబాద్‌లో యాదవ విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించుకోవాలని చెప్పారు. జిల్లా కార్యవర్గాన్ని విస్తరించారు. కార్యక్రమంలో అచ్యుత యాదవ్, శ్రీహరి యాదవ్, మల్లికార్జున్ యాదవ్, రాజేశ్ యాదవ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్‌రంగంలో తిరుగులేని 'వికాట్'

సిద్దిపేటజోన్: సిమెంట్‌రంగంలో వికాట్ తిరుగులేని సంస్థ అని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ అధికారి శ్రీకాంత్ అన్నారు. స్థానిక శివసాయి ఐరన్ డిపో ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలతో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాట్ గ్రూపునకు చెందిన భారతి సిమెంట్ అల్ట్రా ఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందన్నారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా ఉంటుందని చెప్పారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామని, స్లాబ్‌వేసే సమయంలో నిపుణులైన ఇంజనీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడతారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు తాపీమేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ తిరుపతి, డీలర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీమా పత్రాలను అందజేస్తున్న శ్రీకాంత్

సామూహిక ఉపనయన శిబిరం

సిద్దిపేటకమాన్: ఋషి ప్రభాకర్ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో సిద్దిపేట పరిసర ప్రాంతాల్లో గురు పరంపర సామూహిక ఉపనయన సంస్కార ఆవాస శిబిరం నిర్వహించనున్నట్లు ఆ విద్యా కేంద్రం సభ్యుడు డా.దయాకర్ ఆచార్య తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 20 నుంచి 29వ తేదీ వరకు ఈ క్యాంపు నిర్వహించనున్నట్లు ఏడు నుంచి 14యేళ్ల లోపు పిల్లలు చేరవచ్చన్నారు. పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలపై శిక్షణ ఇస్తారని చెప్పారు.

హోంగార్డుకు ఆర్థిక సాయం అందజేత

సిద్దిపేటకమాన్: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న హోంగార్డుకు చికిత్స నిమిత్తం పోలీసు అధికారులు, సిబ్బంది ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బాలకిషన్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్ర చికిత్సకు వెళ్తున్న అతడికి ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, సీఐ ప్రవీణ్‌కుమార్ తోటి సిబ్బందితో కలిసి శుక్రవారం సుమారు రూ.70 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఏసీపీ సుమన్‌కుమార్, సీఐ ప్రవీణ్‌కుమార్

సంక్షిప్త వార్తలు

◆ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగాపూర్, బంజేరుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగంచేసుకోవాలని రైతులకు సూచించారు. దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాములు, నాయకులు నరేందర్‌రెడ్డి, నాయకులు స్వామి, యాదగిరి, శాదుల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

◆ బాధ్యులను శిక్షించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నల్లగొండ జిల్లా బొక్కమంతలపాడు గ్రామానికి చెందిన మల్లీశ్వరి ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలని మాదిగ జాగృతి సంఘం జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, కొంత కాలంగా సహజీవనంచేసి చివరికి ఆమె మరణానికి కారణమైన జాన్‌రెడ్డి, అతడి కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేయాలని కోరారు.

◆ 25న బీఆర్‌ఎస్వీ పాదయాత్ర



చిన్నకోడూరు(సిద్దిపేట): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభను పురస్కరించుకొని బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో 25న సిద్దిపేట నుంచి చేపట్టే పాదయాత్రకు యూత్ భారీగా తరలిరావాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు గుండెల్లి వేణు కోరారు. శుక్రవారం చిన్నకోడూరులో జరిగిన సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రంగధామంపల్లి అమరవీరుల స్తూపం నుంచి సభా ప్రాంగణం వరకు పాదయాత్రగా వెళ్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉమేశ్‌చంద్ర, యూత్ నాయకులు శ్రావణ్, సాయి, రాజశేఖర్, సుధాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆకట్టుకున్న విన్యాసాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సాధనాసురుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాస్, నర్సయ్య, శివరాజం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు దస్తావేజు లేఖరుల బంద్

గజ్వేల్: రిజిస్ట్రేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో శనివారం దస్తావేజు లేఖరులు బంద్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమకు మద్దతు పలకాలని కోరారు.

◆ చేతి పంపులకు మరమ్మతులు



హుస్నాబాద్‌రూరల్: పల్లెల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తున్నారు. బంజేరుపల్లి, అంబాయిపల్లిలో చేతి పంపులకు శుక్రవారం మరమ్మతులు చేయించి తాగునీరు అందుబాటులోకి తెచ్చారు. నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామని అధికారులు తెలిపారు.

◆ రేపు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని కల్లెపెల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ కేసులు ఉపసంహరించుకోండి

సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలంతా సోనియా గాంధీ, రాహుల్‌గాంధీకి అండగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సతీశ్‌కుమార్, రమేశ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.